క్లుప్తంగా

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



శరీన్ నగర్‌లో ప్రజలతో సమావేశమై చర్చిస్తున్న సీఐ మధుసూదన్ గౌడ్

కర్నూలు: చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని నాల్గవ పట్టణ సీఐ మధుసూదన్ గౌడ్ హెచ్చరించారు. కర్నూలు శివారులోని సమస్యాత్మక కాలనీ శరీన్ నగర్‌లో గురువారం ఆయన ప్రజలతో సమావేశమయ్యారు. సీసీ కెమెరాల ఏర్పాటు, వాటి ఆవశ్యకత, సైబర్ నేరాలకు గురికాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. యువత గంజాయి, డ్రగ్స్ వంటి మహమ్మారి జోలికి వెళ్లకుండా ఉండాలన్నారు. ఆయన వెంట ఎస్‌ఐ గోపీనాథ్, సిబ్బంది ఉన్నారు.

శాంతియుతంగా మెలగాలి



ర్యాలీలో పాల్గొన్న జైన్‌లు

కర్నూలు(సెంట్రల్): నవ్‌కర్ మహామంత్ర దివస్ కార్యక్రమంలో భాగంగా స్థానిక నెహ్రూ రోడ్డులోని జైన మందిరంలో శ్రీజైన్ స్వేతాంబర్‌మూర్తి పూజక్ సంఘ ఆధ్వర్యంలో జైనులు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా మహావీర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నగరంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. జైనులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు, ధ్యానం చేసుకున్నారు. కార్యక్రమంలో మణిలాల్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



డిపో-1 ఎదుట ధర్నా చేస్తున్న నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు

కర్నూలు సిటీ: నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం స్థానిక ఆర్టీసీ డిపో-1, 2 ఎదుట ఆర్టీసీ ఉద్యోగులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి పీఎండీ ఇస్మాయిల్ మాట్లాడుతూ ఉద్యోగులను చిన్న, చిన్న కారణాలతో సస్పెండ్ చేయడం మంచిది కాదన్నారు. ఉద్యోగ భద్రత 01/2019 సర్క్యులర్‌లను అమలు చేయాలని, అర్హులైన వారందరికీ పదోన్నతులు కల్పించాలన్నారు. గ్యారేజీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, ఉద్యోగులకు రావాల్సిన బెనిఫిట్స్ ఇవ్వాలని, గతంలో నిలిపి వేసిన వాటిని పునరుద్ధరించాలన్నారు. నిరసనలో ఆ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ పీఏ వలి, రీజినల్ నాయకులు పి.రంగన్న, మద్దయ్య, గ్యారేజీ నాయకులు రవీంద్ర, తిమ్మప్ప, తదితరులు పాల్గొన్నారు.

వర్క్‌షాపును జయపద్రం చేయండి

కర్నూలు(సెంట్రల్): ఈ నెల 12, 13 తేదీల్లో కర్నూలు జరిగే సీఐటీయూ రాయలసీమ జిల్లా ప్రాంతీయ వర్క్‌షాపును జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కె.ప్రభాకర్ పిలుపునిచ్చారు. గురువారం కార్మిక, కర్షక భవన్‌లో సుందరయ్య స్టాండ్ ఆటో కార్మికుల సమావేశాన్ని యూనియన్ అధ్యక్షుడు వలి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ఉద్యోగ, పెన్షనర్ల సమస్యలపై వర్క్‌షాపులో చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు పెద్ద కరుణ, చిన్న కరుణ, శ్రీనివాసులు, శీను పాల్గొన్నారు.

న్యాయవాది వెంకటేశ్వర్లు మృతికి సంతాపం



వెంకటేశ్వర్లు (ఫైల్)

కర్నూలు(సెంట్రల్): జిల్లా బార్ అసోసియేషన్ సభ్యుడు, న్యాయవాది జి.వెంకటేశ్వర్లు మృతికి న్యాయవాదుల సంఘం సంతాపం వ్యక్తం చేసింది. 1994 నుంచి కర్నూలులో న్యాయవాద వృత్తిలో ఉంటూ అనారోగ్యంతో తిరుపతిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందారు. మృతదేహాన్ని గురువారం కర్నూలుకు తీసుకొచ్చారు. ఈ విషయాన్ని తెలుసుకున్న బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు హరినాథ్ చౌదరి, ఎం. వెంకటేశ్వర్లు, మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఓంకార్ తదితరులు నివాళులర్పించారు.

కౌన్సిల్ సమావేశం వాయిదా

ఆదోని టౌన్: ఆదోని మున్సిపల్ కౌన్సిల్ సమావేశం కోరం లేక వాయిదా పడింది. గురువారం చైర్‌పర్సన్ బోయ శాంత ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. పట్టణంలో 42 మంది కౌన్సిలర్లు ఉన్నారు. వైఎస్సార్‌సీపీకి చెందిన 38 మంది కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. బీజేపీ మద్దతు కౌన్సిలర్లు నలుగురు మాత్రమే సమావేశానికి హాజరయ్యారు. వారితో సమావేశం నిర్వహించలేక వాయిదా వేసినట్లు చైర్‌పర్సన్ శాంత, అసిస్టెంట్ కమిషనర్ అనుపమ తెలిపారు. ఈనెల 16న చైర్‌పర్సన్ బోయ శాంతపై వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాస తీర్మానం కారణంగా సమావేశానికి గైర్హాజరైనట్లు తెలుస్తోంది.



చెరుకు రసం తాగుతూ..



సెంట్రల్‌ప్లాజా సమీపంలో తాటి ముంజలు కొనుగోలు చేస్తూ..



జ్యూస్ సేవిస్తూ..



తాటి ముంజలు తీసుకెళ్తూ..

వేసవి తాపం తీరేలా!

తాటి కాయల నుంచి ముంజలు తీస్తున్న దృశ్యం

రోజురోజుకు ఎండలు పెరుగుతున్నాయి. దాదాపు 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. నగర జనం విలవిలలాడుతున్నారు. పనుల మీద బయటకు వచ్చిన వారు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. వేసవి తాపాన్ని తీర్చుకునేందుకు చల్లని పదార్థాలను ఆశ్రయిస్తున్నారు. దీంతో కూల్‌డ్రింక్, జ్యూస్, చెరుకు రసం, లస్సీ దుకాణాలు కిటకిటలాడుతున్నాయి. ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కలిగించే తాటి ముంజలు, కళింగర పండ్లను కొనుగోలు చేస్తున్నారు. ప్రధాన కూడళ్లలో వీటి విక్రయాలు సైతం పెరిగాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



వాటర్ బాటిల్‌తో వృద్ధురాలు

ఆస్తి పన్ను బకాయిలపై వడ్డీ మాఫీ గడువు పొడిగింపు

కర్నూలు (టౌన్): ఆస్తి పన్ను బకాయిదారులకు ఆస్తి పన్నుపై 50 శాతం వడ్డీ మాఫీ గడువును పొడిగించినట్లు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ ఆర్‌జీవీ. క్రిష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 31వ తేదీకి ముగిసిన గడువు ఈనెలాఖరు వరకు ప్రభుత్వం పొడిగించిందన్నారు. ఈ ఏడాది పన్ను మొత్తం చెల్లించే వారికి ప్రభుత్వం 5 శాతం రాయితీ ప్రకటించిందన్నారు.

కటౌట్లు ఎవరి అనుమతితో పెట్టారు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగరంలో మంత్రి టీజీ భరత్ వంద అడుగుల కటౌట్లను పది చోట్లా ఎవరి అనుమతితో పెట్టారో ట్రాఫిక్ పోలీసులు చెప్పాలని బీఎస్పీ సిటీ కన్వీనర్ రాజ్‌కుమార్ అంబేడ్కర్ డిమాండ్ చేశారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ పార్టీ ఆధ్వర్యంలో 11వ తేదీన నిర్వహించే నిరసన కార్యక్రమాలకు సంధించిన పోస్టర్లను అతికించేందుకు వెళ్లితే పోలీసులు అడ్డుకొని దౌర్జన్యం చేయడం అన్యాయమన్నారు. శుక్రవారం మహాత్మజ్యోతిరావు పూలే జయంత్రి సందర్భంగా బీసీ కులాలకు 52 శాతం రిజర్వేషన్ల కోసం బీఎస్పీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట శాంతియుత నిరసన చేపడుతున్నట్లు తెలిపారు.

హోమియో మందులతో దుష్పరిణామాలు తక్కువ



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లాప్రధానన్యాయమూర్తి జి.కబర్ది

కర్నూలు(సెంట్రల్): హోమియో మందులను వాడితే దుష్పరిణామాలు తక్కువగా ఉంటాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయసేవా సాధికార సంస్థ అధ్యక్షుడు జి.కబర్ది సూచించారు. ప్రపంచ హోమియో దినోత్సవాన్ని పురస్కరించుకొని న్యాయ సేవా సాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం న్యాయ సేవా సదన్‌లో ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని జిల్లా జడ్జి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..హోమియో వైద్యం అత్యుత్తమైనదిగా అభివర్ణించారు. ఈ మందులను తీసుకుంటే తక్కువ ఖర్చుతో రోగాలను బాగు చేసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. జిల్లా న్యాయ న్యాయ సేవాధికారసంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి మాట్లాడుతూ..చిన్నపాటి మందుతోనే తీవ్రమైన వ్యాధులను సైతం హోమియో ద్వారా నయం చేసుకోవచ్చన్నారు. అనంతరం అధిక ఎండలకు వడదెబ్బ తగలకుండా ఉండేందుకు అవసరైన హోమియో మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కర్నూలు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ హరినాథ్ చౌదరి, ఎస్‌జీఓ గంగాధర్ రెడ్డి పాల్గొన్నారు.

‘సర్వేపల్లి’లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



విద్యార్థులతో పాఠశాల డైరెక్టర్ పి.శేషన్న, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పి.దీక్షిత్ తదితరులు

కర్నూలు (సిటీ): స్థానిక కృష్ణానగర్‌లోని సర్వేపల్లి విద్యాసంస్థల్లో గురువారం ప్రీ ప్రైమరీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాఠశాల డైరెక్టర్ పి.శేషన్న, గౌరవ అతిథిగా స్కూల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పి.దీక్షిత్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పాఠశాలలో అత్యాధునిక టెక్నాలజీతో విద్యాబోధన జరుగుతుందన్నారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించే విధంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. విద్యార్థులకు క్రమశిక్షణ, అటెండెన్స్, ప్రేయర్ యాక్టివిటీస్, కమ్యూనికేషన్ స్కిల్స్, మ్యాథ్ ఒలంపియాడ్, సర్వేపల్లి ఒలంపియాడ్, స్పెల్‌బీ, హ్యాండ్ రైటింగ్, ఎల్ దొరాదో ప్రోగ్రామ్స్‌లో విజేతలైన విద్యార్థులందరికీ బహుమతులను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కేపీ అరుణశ్రీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపటి నుంచి రామాలయ శతాబ్ది బ్రహ్మోత్సవాలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చిల్కూరు ప్రభాకర్

కర్నూలు(సెంట్రల్): స్థానిక మించిన్ బజార్‌లోని అతిప్రాచీనమైన శ్రీరామాలయం శతాబ్ది బ్రహ్మోత్సవాలను ఈనెల 12వ తేదీ నుంచి వైభవంగా నిర్వహించనున్నట్లు దేవాలయ సమితి అధ్యక్షుడు చిల్కూరు ప్రభాకర్ తెలిపారు. గురువారం ఆలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బ్రహ్మోత్సవాలను ప్రారంభించి నూరేళ్లవుతున్న తరుణంలో శతాబ్ది బ్రహ్మోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ఈనెల 12న పవన హోమం, హనుమద్వాహనం, 13వ తేదీన ధన్వంతరీ హోమం, గజవాహన సేవ, 14న నరసింహ హోమం, శేషవాహన సేవ, 15న గరువా వాహన సేవ, 16న సీతారాముల కల్యాణ మహోత్సవం, సాయంత్రం 5 గంటలకు రథోత్సవ కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ప్రాణేష్, నందికిశోర్, మాళిగి వ్యాసరాజు, నాగోజీ, విఠల్‌రావుపాల్గొన్నారు.

హనుమద్వాహనంపై శ్రీరంగనాథుడు



భక్తులకు దర్శనమిస్తున్న శ్రీలక్ష్మీరంగనాథస్వామి

జూపాడుబంగ్లా: తర్తూరు శ్రీలక్ష్మీరంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు గురువారం స్వామివారు హనుమద్వాహనంపై భక్తులకు అభయమిస్తూ దర్శనమిచ్చారు. ముందుగా స్వామివారి మూల విగ్రహానికి పంచామృతాభిషేకం, పుష్పార్చన, కుంకుమార్చన వంటి విశేషపూజలు నిర్వహించి స్వామివారికి మహామంగళహారతినిచ్చారు. అనంతరం స్వామివారి ఉత్సవవిగ్రహానికి పన్నీటి స్నానం చేయించి పట్టువస్త్రాలు, వెండితొడుగుతో ముస్తాబుచేశారు. మల్లెలతో అలంకరించిన పల్లకీలో స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపుగా గ్రామోత్సవ రథం వద్దకు చేర్చారు. హనుమద్వాహనంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు జయ జయ ధ్వానాల మధ్య గ్రామపురవీధుల్లో స్వామివారి రథాన్ని తిప్పారు.

నేడు గరుడవాహనసేవ

స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారికి గరుడవాహన సేవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ సాయికుమార్, పూజారి ఈశ్వరరెడ్డి, కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి తెలిపారు.

ఆవిర్భావ సభను విజయవంతం చేయండి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కె.జగన్నాథం

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో శుక్రవారం నిర్వహించే ఏపీ రైతు సంఘం 90వ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం పిలుపునిచ్చారు. గురువారం సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1936లో ఏప్రిల్ 11వ తేదీన ఏపీ రైతుసంఘం ఆవిర్భావించగా అధ్యక్షుడిగా సహజానంద సరస్వతి, ప్రధాన కార్యదర్శిగా ఆచార్య ఎన్‌జీరంగా ఉన్నారన్నారు. ఆ కాలంలో దున్నేవాడిదే భూమి అన్న సిద్ధాంతంతో సంఘం ఏర్పాటైనట్లు చెప్పారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఏపీ రైతు సంఘం అన్నదాతల సంక్షేమం కోసం అనేక పోరాటాలు చేస్తూ ముందుకెళ్తోందన్నారు. సమావేశంలో నాయకులు పంపన్నగౌడ్, పి.రామకృష్ణారెడ్డి, చింతల మహేష్, రాజేష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పూలే, అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహిద్దాం

కర్నూలు(అర్బన్): అణగారిన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే, భారత రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిద్దామని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళా ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక బీ క్యాంప్‌లోని వేదిక కార్యాలయంలో జరిగిన కార్యనిర్వాహక కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ బహుజన ప్రజల ఆరాధ్య దైవాలైన పూలే, అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను జిల్లాలోని అన్ని మండల కార్యాలయాల్లో నిర్వహించాలన్నారు.

కార్మికులకు పెండింగ్ జీతాలు చెల్లించాలి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పనిచేసే సెక్యూరిటీ గార్డులు, స్వీపర్లు, పెస్ట్ కంట్రోల్ సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న జీతాలు వెంటనే చెల్లించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లుకు సీఐటీయూ ప్రధాన కార్యదర్శి విజయ రామాంజనేయులు గురువారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య సిబ్బందికి నాలుగు నెలలు, సెక్యూరిటీ గార్డులకు మూడు నెలలు, పెస్ట్ కంట్రోల్ సిబ్బందికి రెండు నెలల జీతాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కార్మికులకు నెలల తరబడి జీతాలు పెండింగ్‌లో ఉండటం వల్ల వారి కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో మైమూద్, కుమార్, శ్రీను, నగేష్ ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కర్నూలు: కర్నూలు బి.క్యాంప్ క్వాటర్స్‌లో నివాసముంటున్న హరినాథ్ రెడ్డి అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం మృతి చెందాడు. ఈయన కొన్నేళ్లుగా కిడ్నీ సంబంధిత వ్యాధి (డయాలసిస్)తో బాధ పడుతుండేవాడు. ఈనెల 3వ తేదీన తన ఇంటి పక్కన కొందరు వ్యక్తులు మద్యం సేవిస్తుండగా హరినాథ్‌రెడ్డి అడ్డు చెప్పినందుకు ఘర్షణ చోటు చేసుకుంది. కాగా హరినాథ్ రెడ్డి 8వ తేదీన తీవ్ర అస్వస్థతతో ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందాడు. మృతుడి కుమారుడు రేవంత్ కుమార్‌రెడ్డి ఫిర్యాదు మేరకు మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనాథ ఆశ్రమాల పరిశీలన

కర్నూలు (సెంట్రల్): నగరంలోని వెంకటరమణ కాలనీలో ఉన్న కీర్తన అనాథ ఆశ్రమం, పెద్దపాడులోని దామోదరం సంజీవయ్య బాల సదన్‌ను న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి వి.లీలా వెంకటశేషాద్రి పరిశీలించారు. అక్కడి పరిస్థితులను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు సరైన భోజనం అందించాలని, పరిశుభ్రతను పాటించాలని సిబ్బందికి సూచించారు. కాగా కీర్తన అనాథ ఆశ్రమంలో పరిశుభ్రత పాటించకపోవడం, రికార్డులను నిర్వహించకపోవడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎల్‌ఎస్‌యూఎం కమిటీ సభ్యులు వెంకట హరినాథ్, శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ శివరాం, డిప్యూటీ చీఫ్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యుడు రాయపాటి శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

హోటళ్లు, చౌక డిపోల్లో విజిలెన్స్ తనిఖీలు

కర్నూలు: గృహ అవసరాలకు వినియోగించే సబ్సిడీ గ్యాస్‌ను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నట్లు ఫిర్యాదుల నేపథ్యంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నంద్యాల ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని శ్రీలక్ష్మీ శ్రీనివాస హోటల్, గ్రాండ్ ఫాస్ట్ ఫుడ్, జావెద్ హోటల్, గోల్డెన్ ఫుడ్ ప్లాజాలో తనిఖీలు నిర్వహించారు. గృహ అవసరాలకు వినియోగించే సబ్సిడీ గ్యాస్‌ను హోటళ్లలో వినియోగిస్తున్నట్లు గుర్తించి ఐదు సిలిండర్లను సీజ్ చేసి నంద్యాల సీఎస్‌డీటీకి వాటి సంరక్షణ నిమిత్తం అప్పగించారు. అలాగే రెండు చౌక డిపోల్లో కూడా తనిఖీలు నిర్వహించి నిల్వలకు, రిజిస్టర్‌లో వ్యత్యాసం ఉండటంతో 1955 అండర్ సెక్షన్ 6(ఎ) కింద కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

స్పోర్ట్స్

13న హ్యాండ్‌బాల్ క్రీడాకారుల ఎంపిక

కర్నూలు (టౌన్): స్థానిక బి.క్యాంపు క్రీడా మైదానంలో ఈనెల 13న జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ క్రీడాకారుల ఎంపిక ఉంటుందని జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం కార్యదర్శి పి. సువర్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో ప్రతిభ కనబరచిన క్రీడాకారులను జిల్లా జట్లకు ఎంపిక చేయనున్నట్లు ఆమె తెలిపారు. ఎంపికయిన క్రీడాకారులు ఈనెల 26, 27 తేదీల్లో సత్యసాయి జిల్లా కదిరిలో నిర్వహించే 54వ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

13న బాలికల క్రికెట్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ అవుట్ డోర్ స్టేడియంలోని క్రికెట్ నెట్స్‌లో ఈనెల 13వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు క్రికెట్ జట్ల ఎంపిక చేపడుతున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి కె. దేవేంద్ర గౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-15, 19, 23, అలాగే సీనియర్ బాలికల క్రికెట్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 2010 సెప్టెంబర్ 1 నుంచి 2013 ఆగస్టు 31వ తేదీ మధ్య జన్మించిన వారు అండర్-15 జట్టు ఎంపికకు అర్హులని తెలిపారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

కర్నూలు (టౌన్): విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు అన్నారు. గురువారం స్థానిక ఇండోర్ స్టేడియంలో తైక్వాండో క్రీడాకారులకు బ్లాక్ బెల్ట్ ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తైక్వాండో క్రీడలు బాల బాలికలకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఆత్మస్థైర్యం పెరుగుతుందన్నారు. క్రీడలకు తన వంతుగా సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో తైక్వాండో శిక్షకులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రుణాలపై అవగాహన కల్పించండి

- మెప్మా పీడీ నాగశివ లీల



సమావేశంలో మాట్లాడుతున్న మెప్మా పీడీ నాగ శివలీల

కర్నూలు (టౌన్): మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న రుణాలపై అవగాహన కల్పించాలని మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ నాగ శివలీల అన్నారు. గురువారం స్థానిక నగరపాలక సంస్థ నూతన కౌన్సిల్ హాలులో కర్నూలు, గూడూరు మున్సిపాల్టీలకు సంబంధించిన సీవోలు, ఆర్‌పీలతో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకు ఒకసారి ఇచ్చిన టార్గెట్‌ను తప్పనిసరిగా చేరుకోవాలన్నారు. ఈ నెల 15వ తేదీలోపు బ్యాంకు రుణాల దరఖాస్తులన్నింటినీ ఆన్‌లైన్‌లో లాగిన్ చేయాలన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌కు సంబంధించి ఆర్‌పీలు ఫీడ్ బ్యాక్ అప్‌లోడ్ చేయాలన్నారు. కార్యక్రమంలో టీపీఆర్‌ఓ వెంకటలక్ష్మి, మెప్మా సీటీ మిషన్ మేనేజర్ విజయ భాస్కర్ రెడ్డి, టీఈఈ, టీఎంసీలు, ఆర్‌పీలు పాల్గొన్నారు.

మురుగు కాల్వల్లో వ్యర్థాలు వేస్తే చర్యలు

కర్నూలు (టౌన్): నగరంలోని మురుగు కాల్వల్లో వ్యర్థాలు వేస్తే చర్యలు తప్పవని నగరపాలక సంస్థ ప్రజారోగ్య శాఖాధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి హెచ్చరించారు. బంగారుపేటలోని ఓ హోటల్ నిర్వాహకులు కొంతకాలంగా వ్యర్థాలను మురుగు కాల్వల్లో వేస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయని, సంబంధిత హోటల్ నిర్వహకులకు గురువారం నోటీసులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. నగర ప్రజలు, హోటల్ రెస్టారెంట్లు, మాంసపు దుకాణాదారులు, వాణిజ్య సముదాయాల దుకాణాదారులు నగర పాలక సంస్థకు సహకరించాలన్నారు.

తెలంగాణ స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో కోటేష్ పెయింటింగ్



కోటేష్ వేసిన చిత్రం

నంద్యాల(అర్బన్): నంద్యాల చిత్రకారుడు చింతలపల్లె కోటేష్ చిత్రం గ్యాలరీ ప్రదర్శనకు ఎంపికైంది. తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో టార్చ్, కళాయజ్ఞం సంస్థలతో శిలానిశ్శబ్దం పేరిట కాకతీయుల శిల్పకళా వైభవం గురించి కాకతీయ కట్టడాలపై పెయింటింగ్స్ వేయాలంటూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 60మంది చిత్రకారులను ఎన్నుకున్నారు. అందులో కోటేష్ వేసిన చిత్రం గ్యాలరీ చిత్రప్రదర్శనకు ఎంపికైంది. ఈ మేరకు ఈనెల 12, 13, 14తేదీల్లో హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో స్టేట్ ఆర్ట్ గ్యాలరీ ప్రదర్శనలో చిత్రాన్ని ఉంచనున్నట్లు కోటేష్ తెలిపారు. కాకతీయ పాలకులు ఘనమైన పాలన అందించారని, నాటి కట్టడాలు, శిథిలమైన శిల్పాలు, ఆలయాలు ఇలా చిత్రాల ద్వారా లోకానికి తెలియజేయాలని ప్రదర్శనను ఏర్పాటు చేశారని చెప్పారు.

ప్రభుత్వ ఆస్తులపై బ్యానర్లు, పోస్టర్లు అతికిస్తే జరిమానా

కర్నూలు (టౌన్): నగరంలోని కూడళ్లలో, డివైడర్లపై, ప్రభుత్వ ఆస్తులపై పోస్టర్లు, బ్యానర్లు అతికిస్తే జరిమానా విధిస్తామని నగరపాలక కమిషనర్ ఎస్. రవీంద్రబాబు హెచ్చరించారు. రాజకీయ పార్టీలు, మతపరమైన సంస్థలు, ఇతర ప్రైవేటు వ్యక్తులు నగరపాలక సంస్థకు సహకరించాలని తెలిపారు. నగర సుందరీకరణకు ఆటంకం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

అటవీ సంరక్షణకు చర్యలు

కర్నూలు(సెంట్రల్): నగర సమీపంలోని పుల్లయ్య పార్కు దగ్గర అటవీ భూముల సంరక్షణ అటవీ శాఖ నడుం బిగించింది. అటవీ భూముల్లోకి ఇసుక కోసం ట్రాక్టర్లు, టిప్పర్లు రాకుండా కాలువను తవ్వారు. అటవీశాఖ భూముల్లోకి రాని పరిధిలో అక్రమంగా ఇసుకను తవ్వి కొందరు ట్రాక్టర్లు, టిప్పర్లలో తీసుకెళ్తున్నా పోలీసులు, మైనింగ్, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు.